టీబీ నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

మలక్‌పేట: టీబీ నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని మలక్‌పేట సర్కిల్ ఎస్‌బీహెచ్‌ఓ డాక్టర్ బ్రిజున్నీసా అన్నారు. వరల్డ్ టీబీ డే పురస్కరించుకుని మలక్‌పేటలోని పలు కాలనీలలో టీబీ నివారణపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రామేశ్వరి, టీబీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ నరేష్, సూపర్‌వైజర్లు గోపినాథ్, కిషన్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు అమరావతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ లీకై మంటలు వృద్ధురాలికి గాయాలు


గాయపడ్డ వృద్ధురాలిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్ కాలనీలోని ఓ అపార్టుమెంటులో గ్యాస్‌లీకై మంటలు వ్యాపించాయి. పక్కనే పూజలు చేసుకుంటున్న వృద్ధురాలికి మంటలు అంటుకుని స్వల్ప గాయపడింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శోభారాణి సంఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. గ్యాస్ ఏజన్సీ నిర్వహకులు గిరికి ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వటంతో వృద్ధురాలికి నష్టపరిహారం అందజేశారు.

వే బ్రిడ్జి నిర్వహణకు త్వరలో టెండర్లు

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జ్‌ని టెండర్లు పిలిచి త్వరలో ఉపయోగంలోకి తెస్తామని హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి ఈ.మల్లేశం తెలిపారు. శనివారం మలక్‌పేట మార్కెట్ కార్యాలయంలో మాట్లాడుతూ వే బ్రిడ్జ్ కొంత మేర చెడి పోయి ఉందని దానిని మరమ్మతు చేసి టెండర్లు పిలుస్తామని తెలిపారు. రిపేర్ల కోసము బడ్జెట్ పెట్టామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్-1 నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


హోమంలో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

నాగోలు: డివిజన్ పరిధిలోని జైపురికాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ 17 వ వార్షికోత్సవ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో నగర సంకీర్తన, సాయికాగడ హారతి, గణపతి దత్తాత్రేయ స్వామి అభిషేకం, అర్చన, షిరిడి సాయి బాబా పంచామృతముతో అభిషేకం, లక్ష్మి గణపతి హోమము, శ్రీ సాయి మధ్యాహ్న హారతి, శేష హారతి నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


గుటిదేవి

నాగోలు: ఇంట్లో నుండి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. నాగోలు పోలీసులు తెలిపిన మేరకు.. యూపీకి చెందిన చరణ్‌సింగ్ తన భార్య గుటిదేవి(35) కలిసి వచ్చి నాగోలు మమతనగర్‌లోని సరస్వతి మార్బల్ షాపులో ఉంటూ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 21 వ తేదీన గుటిదేవి తాను పనిచేసిన షాపులో డబ్బు తెచ్చుకుంటానని భర్తకు చెప్పి ఉదయం ఇంట్లో నుండి వెళ్ళింది. తరువాత తిరిగి రాకపోవడంతో చరణ్‌సింగ్ శనివారం నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పార్కులను ఆహ్లాదంగా తీర్చిదిద్దుతా : కార్పొరేటర్

ఎల్‌బీనగర్: పార్కులను అహ్లాదంగా తీర్చిదిద్దడంతో పాటు సందర్శకులకు మౌళిక సదుపాయాలు కలిపిస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓఎస్ కాలనీ,స్వామి వివేకనంద కాలనీలలోని పార్కులను శనివారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులోని వాకర్స్ పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టి కి తీసుకొచ్చారు.పార్కులలో చెత్త పేరుకపోయిందని, వీధి దీపాలు వెలగడం లేదని, జిమ్ పరికరాలు ఉపయోగంలో లేవని తెలిపారు.

జలం.. జటిలం

- కాలనీల్లో తీవ్ర నీటి ఎద్దడి
- అడుగంటిన భూగర్భ జలాలు
- ట్యాంకర్లపై ఆధారపడుతున్న కాలనీవాసులు


కృష్ణానీటి కోసం బారులు తీరిన ట్యాంకర్లు

దిల్‌సుఖ్‌నగర్: నగరంలో మంచినీటి ఎద్దడి తీవ్రమైంది. కాలనీలలో మంచీటి కోసం స్థానికులు ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో రాను రాను భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. గత వేసవిలో తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొన్న నగర వాసులకు ఈవేసవిలోను తీవ్ర నీటి కష్టాలు తప్పడం లేదు. మలక్‌పేట్‌జోన్ పరిధిలో ఈ ఏడు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా భూమిలోకి చుక్క నీరు కూడా ఇంకక పోవడంతో మార్చి నెలలోనే బోర్లు ఎండిపోయి తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో వర్షాలు పడుతున్నా బోర్‌లు పూర్తి స్థాయిలో రీచార్జ్ కాకపోవడంతో అవసరాల కోసం వాడుకుంటున్న నీటిని కూడా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోర్ నీటిపై ఆధారపడ్డ అపార్ట్‌మెంట్‌లు, కాంప్లెక్స్‌లలో నివాసముంటున్న ప్రజలు భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో ఆందోళనకు గురవుతున్నారు.

అడుగంటిన భూగర్భజలాలు

ఈసారి వర్షాకాలలో అనుకున్నంత వర్షాలు కురవకపోవడంతో ఈవేసవిలో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో బోర్లల్లో నీరు లేక కాలనీవాలసులు ట్యాంకర్ నీటిపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జోన్‌ల పరిధిలోని ఆర్‌కేపురం, సరూర్ నగర్, ఐఎస్‌సదన్, మూసారాంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మాదన్నపేట్, సైదాబాద్ తదితర ప్రాంతాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది.

1300 అడుగుల బోరు వేసినా...

కాలనీలలో గతంలో 150 నుంచి 250 అడుగుల్లోపే నీరు పడేవి. ప్రస్తుతం 600 నుంచి 1300 అడుగుల బోరు వేసినా చుక్కనీరు కూడా రావడంలేదు. దీంతో ఆయా కాలనీవాసులు ప్రైవేటు ట్యాంకర్లపై


ఐఎస్‌సదన్‌లోని కాలనీలలో డ్రమ్ముల్లో మంచినీటిని నింపుతున్న దృశ్యం

ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోర్లు రీచార్జ్ కాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఆర్‌కేపురం, సరూర్‌నగర్, ఐఎస్‌సదన్, సైదాబాద్ ప్రాంతాలలో ఎక్కువగా నివసించే అపార్ట్‌మెంట్లలో నివసించే వారు రోజుకు ఒకటి నుంచి మూడు ట్యాంకర్ల నీరు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో కృష్ణా నీటి ట్యాంకర్లతో పాటు ప్రైవేటు వ్యక్తులు బోర్ నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈప్రాంతాలలలో సుమారు ప్రతిరోజు సుమారు 800 ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతిరోజు సుమారు రూ.9 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు నీటి వ్యాపారంతో పరిస్థితి మరింత దారుణం

అసలే భూగర్భజలాలు అడుగంటుతున్న సమయంలో నీరు ఉన్న బోర్‌ల నుంచి ఇష్టానుసారంగా నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తూ వ్యాపారం చేస్తుండడంతో బోర్లలో నీరు రీచార్జ్ కావడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

వర్షపు నీరు చెరువుల్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి

వర్షం పడిన నీరు ఇంకేందుకు అవకాశం లేకపోవడంతో డ్రైనేజీ కాలువల ద్వారా నీరంతా మూసీలోకి వెళ్తుంది. ఎక్కడ వర్షం పడితే ఆయా ప్రాంతంలోని చెరువుల్లోకి నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చెరువుల ఆక్రమణ తొలగించి కాలువలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాంబాబు, ఆర్‌కేపురం

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి:

వర్షం నీరు భూగర్భంలోకి వెళ్లే విధంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. బోర్‌ల ద్వారా వచ్చే భూగర్భనీటిని కూడా రీసైక్లింగ్ చేసే పద్ధతిని అచరణలో పెట్టాలి.

తిరుమల్‌రెడ్డి, దిల్‌సుఖ్‌నగర్

రక్షణ కల్పించాలంటూ వీహెచ్‌పీ నేత వినతి


వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

హస్తినాపురం: గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి దాడికి యత్నించారని.. తనకు రక్షణకల్పించాలని విశ్వహిందూపరిషత్ జాతీయ ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ.. మొదటి అంతస్తులో నివాసం ఉంటున్న తన సోదరుడి కుమారుడు నిద్రిస్తున్న గది తలుపులు కొడుతూ గట్టిగా మాట్లాడటంతో నాకు ఫోన్‌చేశాడని .. నేనువెంటనే ఎట్టిపరిస్థితిలో గది తలుపులు తెరవవద్దని చెప్పి శనివారం తెల్లవారు జామున వనస్థలిపురం పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. సీసీ పుటేజీ పరిశీలించగా అర్ధరాత్రి సమయంలోఅనుమానాస్పదమైన వ్యక్తుల కదలికలు ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక పూజలు

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ గ్రామంలో బొడ్రాయి లింగస్వామి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం జలాభిషేకం, పంచామృతములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అందరూ కలిసి అభిషేక పూజలు నిర్వహించారు. ఆదివారం గ్రామంలో బోనాలు సమర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సింగరేణి కాలనీలో సదుపాయాలు కల్పించండి


జిల్లా కలెక్టర్‌తో స్థానిక నాయకులు

సైదాబాద్: సింగరేణి కాలనీలో నివసిస్తున్న గుడిసెవాసులకు మౌళిక వసతులు కల్పించాలని సేఫ్ పౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. శనివారం వారు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి కాలనీలో మూడు దశాబ్దాలుగా నివసిస్తున్న గుడిసెవాసులకు అక్కడే పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సింగరేణి కాలనీలో ఉన్నత పాఠశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడి ప్రభుత్వ స్థలంలో చిన్నారుల కోసం ఆటస్థలం నిర్మించాలని అన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఫౌండేషన్ ప్రతినిధి శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

పార్టీ కోసం పని చేసేవారికి గుర్తింపు లభిస్తుంది

మలక్‌పేట: పార్టీ కోసం పని చేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. కృష్ణతులసినగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి మరింతగా బీజేపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీ విధానాలు ప్రజలకు వివరిస్తూ సమిష్టిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సందర్భంగా బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన గౌర దేవేందర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వై. సురేందర్, కొంగర ప్రవీణ్, దినేష్, సంతోష్, పరశురామ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.


దేవేందర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా జంక్షన్ల అభివృద్ధి


రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు

మన్సూరాబాద్: రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కామినేని చౌరస్తా నుంచి సుష్మ చౌరస్తా వరకు ఉన్న జంక్షన్లను అభివృద్ధి పరుస్తున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ చౌరస్తా, పెద్దచెరువు చౌరస్తా, శ్రీరామ్‌నగర్‌కాలనీ చౌరస్తా, కుమ్మరి బస్తీ రోడ్, కామునికాంత చౌరస్తాలను హయత్‌నగర్ సర్కిల్ ఇంజనీరింగ్ ఈఈ రమేష్‌బాబు, డీఈ కనకయ్యలతో కలిసి కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండ జంక్షన్లను వెడల్పు చేసి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నగర మేయర్ విజయలక్ష్మి, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవపాటిల్ ప్రత్యేక చొరవతో ప్రధాన జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఎఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారామ్, నాయకులు హరీష్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ కాలనీ అభివృద్ధికి కృషి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని ఆర్‌టీసీ కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌టీసీ కాలనీలో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని 40 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి రూ. 56 లక్షలు మంజూరు చేయించిన కార్పొరేటర్‌ను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ముకుందరాజ్, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, క్రాంతికుమార్, అరుణ్‌కుమార్, పాపిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నారాయణ, దశరథ, ప్రవీణ్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రపంచనీటి దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హస్తినాపురం: ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో విదిగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని దీనితో భూగర్భజలాలు పెరుగి నీటి కొరత లేకుండా పోతుందని జలమండలి 10 డివిజన్ జనరల్ మేనేజర్ బలరామరాజు అన్నారు. శనివారం ప్రపంచనీటి దినోత్సవం సందర్భంగా జలమండలి, సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ ఆద్వర్యంలో ఇంకుడు గుంత పునర్నిర్మాణం జలసంరక్షణపై విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీ, టీచర్స్‌కాలనీలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జనరల్ మేనేజర్ బలరామరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షపునీరు ఇంకుడు గుంతలోకి ఇంకి వేసవికాలంలో నీటి సమస్య రాకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎంలు రవీందర్‌వర్మ, సన్యాసిరావు, సేవ్‌ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సురేందర్, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ లకావత్ సిల్మానాయక్ , జలమండలి మేనేజర్లు ప్రవీణ్, స్రవంతిరెడ్డి, రజిత పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మలక్‌పేట: భవిష్యత్ తరాలకు నీటిని అందించడానికి నీటి సంరక్షణ ఒక్కటే మార్గమని హిమాయత్ నగర్ డిప్యూటీ ఈవో, మలక్‌పేట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. సేఫ్ వాటర్ నెట్‌వర్క్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాఠశాలలో వరల్డ్ వాటర్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లలో మొదటి సమస్య నీటిదేనని పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి పౌరులందరూ నీటి సంరక్షణ పద్ధతులు పాటించాలని కోరారు. ఇన్‌చార్జి నిర్మల, సేఫ్ నెట్‌వర్క్ ఇండియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పేరిట ప్రజా ధనం వృథా

వనస్థలిపురం: అభివృద్ధిపనుల మాటేమో గానీ, ఆ పనుల పేరిట కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధి పొందుతున్నారు. అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతంలోని పలు కాలనీలు కళ్ల ముందు కనిపిస్తున్నా వాటిని గాలికి వదిలేసి, అభివృద్ధి చెందిన కాలనీలలోనే ఉన్న రోడ్లను తవ్వడం, మళ్లీ నిర్మించడం పనులు చేపడుతుండడంతో ప్రజాధనం వృధా అవుతోంది. వనస్థలిపురం ఫేజ్-2లో కాంప్లెక్స్ సమీపంలో శుభ్రంగా ఉన్న రోడ్డును ఒకటి, రెండు చోట్ల నీరు నిలుస్తోందన్న సాకుతో మొత్తం రోడ్డును తవ్వి పడేశారు. ఇంతకంటే అధ్వాన్నంగా ఉన్న రోడ్లను వదిలేసి ఈ రోడ్డును ఎందుకు తవ్వి పోశారో తెలియక స్థానికులే అయోమయం చెందుతున్నారు. రూ. లక్షలు వెచ్చించి బాగున్న రోడ్లనే మళ్లీ మళ్లీ నిర్మిస్తూ కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధి పొందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


వనస్థలిపురం కాంప్లెక్స్ సమీపంలో రోడ్డును తవ్విన దృశ్యం

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

చంచల్‌గూడ: బీసీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని హైదరాబాద్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం కుర్మగూడ డివిజన్ అధ్యక్షుడు నర్రి మల్లికార్జున్ ఆధ్వర్యంలో సీఎంచిత్రటపానికి పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో కాంగ్రెస్ పార్టీ బీసీ పక్షపాతిగా ముందుకుసాగుతోందన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలి


కార్తికేయస్కూలులో ఇంగ్లీషు ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: విద్యార్థులు జీవితంలో ఒకప్రత్యేక లక్ష్యంతో ముందుకు సాగాలని ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జడ్‌పీ రోడ్డులో గల కార్తికేయ కాన్సెప్ట్ స్కూలులో ఏర్పాటు చేసిన ఇంగ్లీష్ ఫెయర్– 2025 ని కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాదించాలని తమకేరియర్ అద్భుతంగా మలచుకోవాలని సూచించారు.

26న మోహన్‌నగర్‌లో సంకీర్తన గానం

నాగోలు: శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వర్ధంతి సందర్భంగా ఈ నెల 26 వ తేదీన సాయంత్రం 6 గంటలకు మోహన్‌నగర్, ఎస్‌బీహెచ్ కాలనీలోని హరిహర క్షేత్రము, శ్రీ అలిమేలు మంగా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో సంకీర్తనా గానం నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి శ్రుతి మ్యూజిక్ అకాడమి నిర్వహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరల కోసం 8374927736లో సంప్రదించవచ్చని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి


మేయర్ విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: డివిజన్‌లోని వివిధ కాలనీలలో సీసీ రోడ్డు నార్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శనివారం నగర మేయర్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసి కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. పలు కాలనీలలో రహదారులు చిద్రం అయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సత్వరమై పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మేయర్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రాజీనామా చేయాలి

చంపాపేట: హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్‌పై అనుచిత, అభ్యంతకర వాఖ్యలు చేసిన ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని ఆదివాసీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ట్రైబల్ ఫైనాన్స్ దవలప్‌మెంట్(ట్రికా) చైర్మన్ బెల్లయ్య నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన గిరిజన సంఘ నేతలతో కలసి చంపాపేట డివిజన్ పద్మానగర్ కాలనీలోని సుజాతానాయక్ నివాసానికి వెళ్లి మద్దతు పలికారు. త్వరలో నేషనల్ ఎస్టీ కమీషన్ చైర్మన్ దృష్టికి ఈవిషయాన్ని తీసుకెళ్లి ఎమ్మెల్యే పై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గౌని నర్సింహ్మాగౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్

కావాలని రెచ్చగొడుతున్న ఎమ్మెల్యే


సమావేశంలో పాల్గొన్న బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు

ఎల్‌బీనగర్: ప్రశాంతగా ఉన్న ఎల్‌బీనగర్‌లో అల్లర్లను సృష్టించే విధంగా ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నారని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. ఎమ్మెల్యే పోటోకాల్ పేరిట కావాలని రెచ్చగొట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.శనివారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహ్మారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, వంగ మదుసూధన్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, చింతల అరుణసురేందర్‌యాదవ్, బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహ్మాగుప్తా మాట్లాడారు. శంకుస్థాపనల సమయంలో గొడవలు సృష్టించాలని చూసిన బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకున్నందుకు పోలీసులను కూడా బీఆర్‌ఎస్ నాయకులు తప్పుపడుతున్నారని అన్నారు.